# పిచ్చోడు

కథ

- భమిడిపాటి గౌరీశంకర్

సమయం ఉదయం ఏడున్నర...
కాకినాడ బస్ కాంప్లెక్స్ మెల్లమెల్లగా సందడిని పుంజుకుంటున్నది.
హైదరాబాద్ నుంచి వచ్చిన బస్సు దిగిన నేను... సూట్‌కేస్‌ను దూరంగావున్న కర్రబెంచీపై పెట్టి... ఒళ్ళు విరుచుకొని కాస్త రిలాక్స్ అవుదామని కూర్చున్నాను. మెళ్ళోనున్న బేగ్‌లో నుంచి మంచి నీళ్ళ సీసా తీసి... చివరగా మిగిలిన నీటిని తాగేసాను.
పది నిమిషాలు తరువాత దంతాధావనం ముగించుకొని సామాను జాగ్రత్తగా సంచిలో భద్రపరిచాను.



పేపర్ కొనుక్కొని.. కేంటిన్‌వైపు వెళ్ళి... టీ నీళ్ళు గొంతులో పోసుకున్నాను. వాచీ చూసాను. నాకవసరమైన బస్సు పదిగంటలకు కానీ రాదు. అంతవరకు ఏదో ఒకటి చేయక తప్పదు. కొంచెం సేపు పేపరు తిరిగేసాను. అన్నీ రొటీన్ వార్తలే. చదివినంతసేపు చదవాలనే ఆత్రుత లేదా చదివాక ఏంలేక నిర్లిప్తత.

ఈ ప్రాంతం పరిసరాలు వదలి దాదాపు పన్నెండు సంవత్సరాలవుతోంది. కాంప్లెక్స్ చుట్టు ప్రక్కల పరిశీలించాను. బాగా మారిపోయింది. చిన్నచిన్న ఇళ్ళ స్థానంలో పెద్ద పెద్ద భవంతులు, లాడ్జీలు కనిపించాయి. 'గడిచిపోయిన సంవత్సరాలలో ఎంత అభివృద్ధి చెందిందో కదా నగరం' అనిపించింది. కాకినాడ వంటి వ్యాపార కూడలి ప్రాంతాలు అభివృద్ధి చెందడం ఎంతసేపు.

ఇంకేంచేయాలో తెలియలేదు. అప్రయత్నంగా జేబులోనున్న మామయ్య రాసిన ఉత్తరాన్ని బయటకు తీశాను. నా కుటుంబం నేనూహించని ఆపదలలో చిక్కుకొని చిన్నాభిన్నం అయిపోయింది. అమ్మా, నాన్న, చెల్లి సామూహికంగా పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నం చేసారు. స్థానికులు, మామయ్య తీసుకున్న జాగ్రత్తలు వలన నాన్న మాత్రం బ్రతికి బయటపడ్డారు. కానీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసిన తరువాత ఎక్కడకు వెళ్ళిపోయాడో ఎవరికి తెలియరాలేదు. బ్రతికున్నాడో లేదో? ఇవన్ని నాకు ఆలస్యంగా తెలిసాయి.

కారణం నేనీ దేశంలో లేకపోవటం.

నాకు చదువు పెద్దగా అబ్బలేదు. నేను శ్రద్ధ వహించలేదు అనటం బాగుంటుంది. పదవ తరగతి నాలుగుసార్లు తప్పాను. మాది బాగా 'కలిగిన' కుటుంబమే. రాజుల కుటుంబం. నేను అమ్మ, నాన్నా, చెల్లి. చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం.

పదవ తరగతి నాల్గవసారి తప్పినప్పుడు నాన్న నన్ను ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నాడు.


మా మధ్య జరిగిన సంభాషణ సన్నివేశాలు నాకింకా గుర్తున్నాయి.

* * *

వెంకటపతిరాజు గారికి కాకినాడ సమీపంలోనూ, పిఠాపురానికి దగ్గరలోనూ దాదాపు ముప్పయి ఎకరాల సుక్షేత్రం ఉంది. సేంద్రీయ ఎరువులు వినియోగిస్తూ ఓ పద్ధతి ప్రకారం వ్యవసాయం చేసి చక్కని ఫలితాలను, ఫలాలను పొందడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. రెండు మూడు సార్లు ఉత్తమ రైతు అవార్డును కూడా అందుకున్న వ్యక్తాయన. కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం వంటి ప్రాంతాలలో రాజుగారంటే మంచి పేరుంది. ఆ ప్రాంత ప్రజలు రాజుగారితో ఏ రకమైన సంబంధమైన కళ్ళుమూసుకొని అంగీకరిస్తారు. నైతిక సూత్రాలు విలువలంటే ఆయనకు ప్రాణం. ఎవరి దగ్గర చేయి చాచడం గాని, చేయి చాచిన వారికి లేదనడం కాని రాజుగారికి తెలియదు. భార్య కూడా అతనికి తగినదే. మా దొడ్డ ఇల్లాలని ఆ ప్రాంత ప్రజలు బాహాటంగానే ఒప్పుకుంటారు.

ఆ దంపతులకు ఒక కొడుకు, కూతురు. పిల్లలు చదువు విషయంలో రాజుగారికి కొన్ని ఖచ్చితమైన లెక్కలున్నాయి. అతని దృష్టిలో అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ సమానమే. మనిషి తన కాళ్ళ మీద తాను నిలబడటానికి ప్రపంచ జ్ఞానం తెలుసుకోవడానికి చదువెంతో అవసరమని అతని నమ్మకం. కూతురు చురుకైనది. తెలివైనది. దాని గురించిన బెంగ అతనికి లేదు. కాని కూతుర్ని పెద్దపెద్ద చదువులు చదవమని ప్రోత్సహిస్తున్న భర్తతో అప్పుడప్పుడు పోట్లాట పెట్టుకొనేది అతని భార్య.

''చూడండి ఆడపిల్లను పై చదువులంటూ



ఊర్లంట తిప్పటం నాకసలు నచ్చలేదు. ఎప్పటికైనా దాన్ని ఓ అయ్య చేతిలో పెట్టవలసిందే. పెద్ద పెద్ద చదువులు చదివిస్తే దానికి సరైన సంబంధం తేలేక మనం చావాలి. కొంచెం ఆలోచించండి.''

''చూడమ్మడు ఈ రోజుల్లో ఎంత డబ్బున్నా చదువులేనిదే ఏ అయ్య కూడా అమ్మాయిని చూడటం లేదు. మరో విషయం మన దగ్గరున్న భూములు ఇలాగే కలకాలం ఉండిపోతాయని అనుకోకు. తరిగిపోతాయి. కాని చదువలా కాదు. వ్యవసాయంలో రోజురోజుకు వస్తున్న మార్పులు, ప్రభుత్వ విధానాలను గురించి లోతైన అనుభవం నీకు లేదు. నా పుట్టుక దగ్గర నుంచి మట్టి పిసికి పెరిగిన వాణ్ని. వర్తమాన సమాజాన్ని వాస్తవంగా చూడటం నేర్చుకో. మరోసారి పిల్లల చదువు విషయంలో నేను తీసుకొనే నిర్ణయాలకు అడ్డురాకు. నేను పడిన, పడుతున్న కష్టం నా పిల్లలు పడకూడదు'' అని ఖచ్చితంగా చెప్పేసారు.

ఆ రోజు నుంచి ఆమె ఆ విషయాలను అసలు పట్టించుకోవడం మానేసింది.

పిల్లల చదువు విషయంలో ఇంత స్పష్టమైన అభిప్రాయాలున్న రాజుగారికి తన కొడుకు పదవ తరగతి నాలుగుసార్లు తప్పడం అవమానమనిపించింది. వీధిలోకెళ్తే అందరూ ఈ విషయం గురించి అడిగిన వారే ఎక్కువ. రకరకాల శిక్షలు విధించి, బాధించి కొడుకుని సక్రమమైన మార్గంలో పెట్టవచ్చు. కాని ఎంతకాలం?

ఆయనో నిర్ణయానికొచ్చాడు.

ఆ రాత్రి కొడుకును పిలిపించారు తన గదికి.



## ఇలియానా చిరుబుర్రులు

**ఇలియానాకి ఈ మధ్య చిరుబుర్రులు, చిరాకులు ఎక్కువయ్యాయట! ఈ సంగతి ఎలా తెలిసిదంటే ఇటీవల ఈ ముద్దు గుమ్మడు ఒకానొక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు, ఆమెను అభిమానులు, మీడియా చుట్టుముట్టినప్పుడు చాలా చిరాకు వ్యక్తం చేసిందట! మీద పడుతున్న అభిమానులను 'కొంచెం దూరంగా ఉండండి! ఇలా మీద పడడం పద్ధతి కాదు' అని విసుక్కుని, చిరచిరలాడుతూనే నిలబడి, కాస్సేపటికి తేరుకుని, మళ్ళీ అభిమానులను కావాలనుకుందట! ఎప్పుడూ లేనిది ఇలియానాకు ఎందుకంత చిరాకు కలిగిందో ఎవరికీ అంతు చిక్కలేదు. అభిమానులన్నా, మీడియా అన్నా అభిమానపడే ఇలియానాకు ఏమయిందో ఏమోః మరి!!**

మెల్లగా చెప్పసాగారు. ''చూడు నేను నీ అభివృద్ధిని కోరుకుంటున్నాను. మనకేవో వ్యవసాయ భూములు ఉన్నాయి. వాటిమీద గరిసెలకు గరిసెలు ధాన్యం వస్తుంది. మేం రాజులం. రాజుల్లాగే బ్రతుకుతాం అనే భ్రమలు నుంచి బయటపడి ఎంత వేగంగా వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటే అంత మంచిది. రాబోయే కాలంలో వ్యవసాయ రంగం నుంచి సరైన భరోసా రైతుకు లేదు. రైతు వరి పండిస్తాడు. బియ్యం ఎక్కువ ధరను చెల్లించి కొనుక్కోవాలి. కందులను పండిస్తాడు. కందిపప్పు ఎక్కువ ధరకు కొనుక్కోవాలి. పెసరపప్పు, ప్రత్తి, మిరప ఏ వస్తువైనా ఇంతే. ఇదీ వర్తమానం. భవిష్యత్ గురించి చెప్పలేం. అసలు భవిష్యత్‌లో 'రైతులు' అనే వర్గం కనుమరుగు కావచ్చు. ఇవన్నీ నీకు చాదస్తంగా కనిపించవచ్చు. అర్థంలేని భయాలని పించవచ్చు. నీ అభిప్రాయాల్తో నాకు పనిలేదు. నాకంటూ ఓ విజనుంది. దాని ప్రకారమే నీవు నడుచుకోవాలి''.

అతను కొంచెం సేపు ఆగాడు. కొడుకు శ్రద్ధగా వింటున్నాడని తెలుసుకొన్నాక మళ్ళీ ప్రారంభించాడు. ఈ సారి ఆయన గొంతులో మార్దవం.

''చూడు కన్నా నీకు వాస్తవ సమాజ పరిస్థితులు తెలియవు. చదువొక్కటే మనిషి స్థిరాస్తి. మిగిలినవన్నీ తాత్కాలికమే. బాగా చదువు. మంచి ఉద్యోగం సంపాదించుకో. జీవితంలోని ఆనందాన్ని అనుభవించు'' అని చెబుతూ తెల్లకాగితంతో చుట్టబడిన ఓ కట్టను కొన్ని స్టాంపు పేపర్స్‌ను బయటకు తీసారు.

కట్టను కొడుకు చేతికి అందిస్తూ ''ఇంద. ఇందులో లక్షరూపాయిలున్నాయి పిఠాపురం దగ్గర్లో ఉన్న భూమిని తాకట్టు పెట్టాను ఎందుకని అడగకు. భవిష్యత్తులో ఏమైనా జరగవచ్చు స్టాంపు పేపరుపైన సంతకం చేయి. ఈ డబ్బు పట్టుకొని హైదరాబాద్‌లో నీ స్నేహితుడున్నాడని వాడు పిలుస్తున్నాడని వెళతానని నన్ను చాలాసార్లు నీవడిగావు గుర్తుంది. అక్కడకు వెళ్ళిపో. ఏం చేస్తావో తెలియదు. ఎలా బ్రతుకుతావో నాకనవసరం. జీవితంలోని కష్ట నష్టాలను గ్రహించు. సుఖజీవనానికి ఎన్ని కష్టాలు పడాలో తెలుసుకో నీ కాళ్ళ మీద నీవు నిలబడి సంపాదించిన సంపాదనలో ఎంత హాయి, కమ్మదనం స్వేచ్ఛ ఉన్నాయో గ్రహించు. ఒక్క విషయం జీవితంలో గెలిస్తేనే తిరిగిరా. లేకపోతే రాకు. డ్రమటిక్‌గా మాట్లాడుతున్నాననుకోకు. నటించడం రైతుకు తెలియదు. వాస్తవంగా బ్రతకడం నిర్భయంగా మాట్లాడటమే తెలుసు. నేను కూడా రైతునే కదా. నా మాటలు ఇలానే ఉంటాయి.''

తండ్రి కొడుకుల మధ్య భరించలేని నిశ్శబ్దం. తండ్రి అందించిన కట్టను జాగ్రత్తగా అందుకొని. కాగితాలపైన సంతకం చేసాడు కొడుకు. ఇటువంటి తండ్రి బహుశా ప్రపంచంలో మరొకరుండరేమో.

కొడుకు మౌనంగా బయటకు నడిచాడు.

''ఒక్కమాటరా చిన్న'' తండ్రి ఏదో చెప్పాలనుకున్నాడు. మరలా తనే ''ఏం లేదులే జాగ్రత్తగా వెళ్ళు'' అన్నాడు.

తండ్రి ముఖంలోకి ఆ కొడుకు సూటిగా చూడలేదు. చూసి ఉంటే అతని కళ్ళలో కన్నీటి నది కనిపించి ఉండేది. అలా డబ్బుతో బయట ప్రపంచంలోకి వచ్చిన కొడుకును నేనే.

* * *

బస్సు హారన్ దగ్గరగా వినిపించింది. ఒక్కసారి వాస్తవంలోకి వచ్చాను. వాచీ చూసుకున్నాను. తొమ్మిదయింది. ఇంకా గంట గడపాలి.

మామయ్య ఉత్తరంలో చాలా విషయాలు రాసాడు. మొత్తం భూమి పోయిందని సమయానికి డబ్బు కుదరకపోవటం చేత చెల్లి పెళ్ళి ఆగిపోయిందని, అవమానం తట్టుకోలేక ముగ్గురూ పురుగుల మందు త్రాగి ఆత్మహత్యకు పాల్పడి పొలంలో పడిపోతే వెంటనే హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళినా అమ్మ చెల్లి బ్రతకలేదని, నాన్న బ్రతికినా ఆరోగ్యం కుదుటపడిన తరువాత హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన మరుసటి రోజే కనిపించకుండా పోయాడని, ఇన్ని సంవత్సరాలైన అతని ఆచూకి తెలియరాలేదని, బ్రతికి ఉన్నాడో లేడో కూడా తెలియదని రాసాడు. ఈ విషయాలన్నీ ఎన్నిసార్లు తనకు తెలియజేయాలనుకున్నా అందుబాటులో లేకపోవడం చేత తెలియ చేయలేదని రాసాడు. చివరకు అన్ని వివరాలు తెలియజేస్తూ సమగ్రంగా ఓ ఉత్తరం తన స్నేహితుడి అడ్రస్ సంపాదించి అతనికి పంపగా నేను దానినందుకని ఇదిగో ఇలా బయలుదేరాను.

అమ్మా, చెల్లి, నాన్న ఎవరినీ చివరిసారిగా కూడా చూడలేకపోయాను. ఇంక నాకెవరున్నారు. ఎవరి కోసం నేనా ఊరు వెళ్ళాలి.

ఈ సంపద, ఈ విజయం నేనెవరితో పంచుకోవాలి. కొడుకుగా నా బాధ్యతలను నిర్వహించుకోలేకపోయాను.

గుండెల్లో నుంచి దుఃఖం తన్నుకు వచ్చింది. ఎవరి మీదో తెలియని కసి.

అసలు ఇదంతా ఎలా జరిగింది. ఎందుకు జరిగింది. అసలెవరు చేసారు.

ముప్పయి ఎకరాల భూమి ఎలా పోయింది. అసలేం జరిగింది. వెంకటపతిరాజుగారి జీవిత చరమాంకంలో ఇంతటి విషాదం ఇంతటి లేమి మిగల్తాయని ఎవరూహించారు?

ఈ విషయాలన్నీ నాకు తెలియకపోవటానికి కారణం నేను అమెరికాలో ఉండటమే. ఒకటి కాదు రెండు కాదు దాదాపు నాలుగు సంవత్సరాలు. కంపెనీ అప్పగించిన ప్రాజెక్టు పనిమీద టీం లీడర్‌గా ఆగిన చోట ఆగకుండా ఆ దేశమంతా తిరిగాను. ఇంకా తిరగాలి. కొంత తాత్కాలిక విరామం వల్ల ఇదిగో ఇలా ఇండియా వచ్చాను. రాగానే స్నేహితుడి ద్వారా అన్ని విషయాలు తెలుసుకొని వెంటనే బయలు దేరాను.

దూరంగా ఏదో కలకలం...

అందరూ గుంపుగా మూగి ఉన్నారు. ఎవరి మటుకు వారు గడబిడగా మాట్లాడుకుంటున్నారు. అక్కడేం జరుగుతున్నదో తెలుసుకోవాలనే ఆసక్తి, ఉత్సుకత నాలో కలిగాయి. ఇంకా సమయం ఉంది. ఈలోగా చూస్తేపోలా.

ముందుకు కదిలాను. గుంపును త్రోసుకుంటూ ముందుకు వెళ్ళాను.

అక్కడో పిచ్చోడు మూర్ఛపోయి ఉన్నాడు.

పొడుగాగా పెరిగిన జుత్తు శరీరం నిండా దుమ్మూ, ధూళి అరచేయి మందాన పేరుకు పోయి ఉన్నాయి.

బట్టలు పీలికలుగా మారి ఉన్నాయి. అతని దగ్గరకు వెళ్ళి కనీసం మంచినీళ్ళయినా ముఖాన కొట్టటానికి జనం సందేహిస్తున్నారు. కంపు కొడుతున్న పరిసరాలలో ఎవరూ ఎక్కువ సేపు నిలబడలేక ముందుకు కదిలారు. కళ్ళు, ముక్కు, నోరు లీలగా కనబడుతున్న అతని ముఖాన్ని పరిశీలనగా చూసిన నాకు స్మృతిపథంలో 'ఓ ముఖం' ఫ్లాష్‌లా కనిపించింది. మరిక ఆలస్యం చేయలేదు. కూలీని పిలిచాను. అతను సందేహిస్తున్నాడు. జేబులో నుంచి వందనోటు తీసి అతనికి ఇచ్చాను. అతనిలో ఉత్సాహం తన్నుకు వచ్చింది. అతనే ఆటోను పిలిచాడు. పిచ్చోడి శరీరాన్ని అందులోనికి చేర్చాను. నేను డ్రయివరు ప్రక్కన కూర్చున్నాను. ఆటో కదిలింది. కూలీ నాకు నమస్కరించాడు. అందరూ నన్ను వింతగా చూడటం నాకు కనిపించింది.

అదో ఖరీదైన కార్పొరేట్ హాస్పిటల్.

ఎన్నెన్నో అధునాతన హంగులున్నది. అనుభవజ్ఞులైన డాక్టర్లు అక్కడ ఉన్నారు. డబ్బుకు వెనకడుగు వేయకపోతే యమునితో యుద్ధం చేసి మరీ ప్రాణం పోయగల అపరధన్వంతర్లున్న హాస్పిటలది. వైద్య రంగంలో ఎన్నెన్నో అద్భుతాలను ఆవిష్కరించిన ఖ్యాతి దానిసొంతం.

ఆటోను ఆపమన్నాను. పిచ్చోడి శరీరాన్ని ఆటోలోనే ఉంచి నేను హాస్పిటల్‌లోనికి వెళ్ళాను.

నాకు 'కార్పొరేట్ సంస్థ ఇచ్చిన' గుర్తింపు కార్డు, నేను మాట్లాడుతున్న ఆమెరికన్ ఇంగ్లీష్ యాక్సెంట్, నా జేబు బరువు గమనించిన సిబ్బంది మరో ప్రశ్న వేయకుండానే అడ్మిట్ చేసుకున్నారు.

డాక్టర్ ఓ అప్లికేషన్ ఫారంను నా ముందుంచి ''అతని వివరాలు, అతను మీకేమవుతాడో తెలియజేసే వివరాలు, మీ పూర్తి చిరునామా సెల్, ఇ- మెయిల్ నెంబర్లు రాయండి. పూర్తి చేసిన తరువాత ఎంత కట్టాలో అదిగో ఆ కనబడుతున్న కౌంటర్లో అడిగితే చెబుతారు. ఎమౌంట్ కట్టేయండి'' అని ఓ కౌంటర్ వైపు చూపించాడు.

అతని కళ్ళలో ఆసక్తి... ఆ పిచ్చివాడికి నాకు ఏమిటా సంబంధం అని... నేను అప్లికేషన్ పూర్తిచేసి ఇచ్చాను. అతను ఆత్రుతగా గమ నించడం, నేను రాసింది చూసి అవాక్కవడం నా దృష్టి నుంచి దాటి పోలేదు.

తరువాత కార్యక్రమాలు చకచకా జరిగిపోయాయి.

నేను తీసుకువచ్చిన పిచ్చివాడ్ని ఐ.సి.యులో ఉంచారు.

నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను. దూరంగా కుర్చీలో కూర్చున్నాను. ఫేన్‌గాలి చల్లగా ముఖానికి తాకుతున్నది. నిముషం పాటు సుఖాన్ని ఆస్వాదించి సెల్‌తీసి మామయ్యకు ఫోన్ చేసాను. హాస్పిటల్‌కు రమ్మన్నాను. ముందు గాబరా పడ్డాడు. విషయం తెలియజేసాకా సర్దుకున్నాడు.

''ఓ పిచ్చివాడి కోసం అంత శ్రమపడటం దండగన్నాడు. మీ నాన్న బుద్దులు నీకువచ్చాయన్నాడు'' అంతా విని ఫోన్ ఆఫ్ చేసాను.

ఓ గంటన్నర తరువాత మామయ్య నా ముందున్నాడు.

''ఇంతకీ ఇక్కడ ఇలా... ఇండియా ఎప్పుడొచ్చావు... వచ్చిన వాడివి తిన్నగా ఇంటికి రాకుండా దారిన పోయిన దరిద్రాలన్నింటిని నెత్తిన చుట్టు కోవడం ఎందుకు చెప్పు. సర్లే జరిగిపోయింది. చేయాలనుకున్నావు చేసావు. పద ఇంటికి పోదాం. మనం మాట్లాడుకోవలసినవి చాలా ఉన్నాయి. అత్తయ్య నీ కోసం గాబరా పడుతున్నది''.

''పోనీ ఆ పిచ్చోడ్ని చూడకూడదు ఓ సారి అన్నానేను.''

''అక్కర్లేదు బాబు. నీవు సేవలు చేసావు కదా చాలు పద పద'' అతని గాభరా చూస్తుంటే నన్ను బలవంతంగా లాక్కుపోయేటట్లున్నాడు.

''ఆగు మామయ్యా కొన్ని ఫార్మాలిటీసులున్నాయి. డాక్టర్‌తో మాట్లాడి వాటిని పూర్తిచేసి వస్తాను'' అని డాక్టర్‌గారి గదివైపు నడిచాను.

గదిలో డాక్టర్‌గారు నా కోసమే చూస్తునట్టున్నారు.

''మీరేమో వర్రీ కానవసరం లేదు. సరైన పోషణ పోషకాహారం, సంరక్షణ లేక లివర్ కొంచెం దెబ్బతిన్నట్టుగా ఉంది. ప్రాణభయం లేదు. బాడీ ఫంక్షనింగ్ బాగుంది కాని'' ఆగాడు.

''ఏం ఫర్వాలేదు డాక్టర్. సమస్య అనేది ఉంటే నిర్భయంగా చెప్పండి ఫర్వాలేదు. కాని అతను నాకు ఆరోగ్యంగా కావాలి''

''అదే చెబుతున్నాను. అతను సంపూర్ణంగా కోలుకోవాలంటే కనీసం ఓ నెల రోజులపాటు ఇక్కడ మా అబ్జర్వేషన్‌లో ఉండాలి. మీకేమీ ఇబ్బంది లేదు కదా! లేదు అటువంటిదేమైనా ఉంటే నాకు చెప్పండి. దాని ప్రకారం ఆలోచిద్దాం.''

నాకు తెలుసు ''ఇబ్బంది'' అనే పదం దేనికోసం ఉపయోగించారో. కార్పొరేట్ హాస్పటల్స్‌లో ''ఇబ్బందంటే'' డబ్బు ఉందా లేదా అని తెలుసు కోవటం. ఇక్కడ నాతో జాగ్రత్తగా మాటలు ఆచితూచి మాట్లాడటం వెనుక మరో మర్మం కూడా ఉంది. నెల రోజుల పాటు హాస్పటల్ ఖర్చులు ఎంతవుతాయో దాదాపుగా నేనూహించగలను. నేను సంతకం చేస్తే నేను పనిచేస్తున్న 'కార్పొరేట్ సంస్థ' 'మెడికల్ క్లయిమ్' ఇస్తుంది. ఇటువంటి హాస్పిటల్స్ నడుస్తున్నది ఇటువంటి 'క్లయిమ్స్' వల్లనే.

''డాక్టరుగారు నాకే ఇబ్బంది లేదు. డబ్బుకోసం మీరాలోచించవద్దు. నాకు తను ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. కాని ఓ పదిహేను రోజుల్లో నేను మరలా అమెరికా వెళ్ళిపోవాలి. ఈలోగా చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి. నేనున్నా లేకపోయినా మీరు ట్రీట్‌మెంట్ ఆపకూడదు. కనుక నేను అమెరికా వెళ్ళేలోపల అతనికి బాగయితే బాగుంటుందని నా అభిప్రాయం అంతే. అందాక ఈ పదివేలు ఉంచండి. మిగిలినది ఒకటి రెండు రోజుల్లో వస్తాను. సెటిల్ చేస్తాను. కాని అతనిని జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత మీ పైన పెట్టి వెళుతున్నాను. అన్యధా భావించకండి'' అని జేబులోంచి వెయ్యి రూపాయి నోట్లు పదితీసి అతని టేబులు పైన ఉంచాను.

డబ్బును జాగ్రత్తగా అందుకొని ''మీరంతగా చెప్పాలా అతన్ని నా స్వంతమనిషిగా భావించి ట్రీట్ చేస్తాను. మీరు నిరభ్యతరంగా మీ పనులు పూర్తి చేసుకొని రండి''

వెంటనే నర్స్‌ను పిలిచి చేయవలసిన పనులను పురమాయించాడు. డాక్టర్ చూడకుండా నర్స్ చేతిలో రెండు వందల కాగితాలుంచాను. ఆమె నన్ను దేవుడిగా చూసిన చూపు మరచి పోలేనిది.

'మనీ' పారేస్తే మనుషుల్ని 'దేవుళ్ళు'గా చూసుకుంటారని అగ్రదేశంలో నేను తెలుసుకున్న నీతి.

ఇహ పిచ్చోడి గురించి నాకే చింతా లేదు.


తృప్తిగా బయటకు వచ్చాను.

* * *

ఆటో ఎక్కి హాస్పిటల్ నుంచి కాంప్లెక్సు చేరుకున్నాం. సమయం పన్నెండు గంటలు కావస్తున్నది. సాయంత్రం నాలుగు వరకు ఏ బస్సులు లేవు. నేనాలోచించాను. ''పద మామయ్యా ఆటోలో వెళ్ళిపోదాం.''

''వద్దురా ఎక్కువ అడుగుతాడు''

''ఫర్వాలేదు మామయ్య సాయంత్రం నాలుగు వరకు ఇక్కడే ఉంటే ఎంత ఖర్చవుతుందో ఆలోచించు.



దానితో పోలిస్తే ఆటోవాడు అడిగేది ఎక్కువా చెప్పు''

మామయ్య లెక్కలు వేసాడు ''నిజమేరా... పద'' అన్నాడు.

ఇద్దరం ఆటో మాట్లాడుకున్నాం.

ఆటో వేగంగా బయలుదేరింది.

* * *

ఐదు నిముషాలు గడిచాయి. గాలి చల్లగా ఉంది. ఇంకా పూర్తిగా ఎండాకాలం రాలేదు. రోడ్డుకు ఇరుప్రక్కలా పచ్చని పొలాలకు బదులు పొలంలో అక్కడక్కడ పాతబడిన రాళ్ళు కనిపించాయి. ''రియల్ ఎస్టేట్ బిజినెస్'' విషపు పడగ నీడ రైతులను పొలాలను కబళిస్తున్నదన్నమాట.

''ఇప్పుడు చెప్పరా నీ గురించి. ఎక్కడున్నావు ఇన్నాళ్ళు? ఏం చేసావు? అసలు అమెరికా ఎలా వెళ్ళావు?. ఎందుకు వెళ్ళావు?''

''అంత గొప్పగా చెప్పుకోవడానికేమీ లేదు మామయ్య తిన్నగా నా స్నేహితుడి దగ్గరకు వెళ్ళాను. వాడికి అన్ని విషయాలు దాచకుండా చెప్పాను. నా దగ్గరున్న డబ్బులో ఏభైవేలును రెండు పాతికలుగా చేసి రెండు జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేసాడు. వాటిమీద వడ్డీ నెల నెలా నా కందేలా చేసాడు. మిగిలిన ఏభై వేలును ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకొనే విధంగా బ్యాంకులో వేసాడు. నేను నా లక్ష్యం మరిచిపోయి నగరవాస సుఖాలకు డబ్బు ఖర్చు చేస్తానేమోనని వాడి పేరు నా పేరు మీద ''జాయింట్ అకౌంట్'' ప్రారంభించాడు. ముందు ఓ కంప్యూటర్ సెకండ్ హ్యాండ్‌ది కొన్నాను. ప్రయివేట్‌గా ఇంటర్ కట్టాను. ఇంటర్ పూర్తయ్యేసరికి కంప్యూటర్ పైన ఆంగ్లభాషపైన పట్టు సంపాదించాను. అంతవరకు నా సంపాదన మీదనే ఆధారపడాలని భావించి ఉదయం పేపర్‌బాయ్‌గా సాయంత్రం హోటల్ సర్వరుగా చేసేవాడిని. మధ్యాహ్నమంతా చదువుకొనే వాడిని. ఇంటర్ తరువాత డిగ్రీ కూడా ప్రయివేట్‌గా కట్టాను. అది పూర్తయేసరికి కంప్యూటర్‌పై సమగ్రమైన పరిజ్ఞానం సంపాదించాను. చిన్న చిన్న ఉద్యోగాలు మానేసాను. ఓ కార్పొరేట్ సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కుదురుకున్నాను. నేను కంపెనీని నమ్మాను. నన్ను కంపెనీ నమ్మింది. నాకు కష్టపడటమే తప్ప మరొకటి తెలియదు. కొద్ది కాలంలోనే టీం లీడర్‌గా ఎదిగి ఓ ప్రాజెక్టు పనిమీద అమెరికా వెళ్లాను. నాన్న చెప్పిన మాటలు, అతనిచ్చిన డబ్బును స్ఫూర్తిగా తీసుకున్నాను. నా స్నేహితుడు నన్ను ఎంతగానో ఆదుకున్నాడు. అదరించాడు. వాడి సహకారమే లేకుంటే నేనెక్కడ ఉండేవాడినో! ఏది ఏమైనా నా అభివృద్ధిని చూసి ఆనందించడానికి నా కెవరున్నారు చెప్పు'' అప్రయత్నంగా నా కంటిలో కన్నీరు.

''ఛీ...ఛీ... ఏంటా మాటలు ఎవరైనా చూస్తే నవ్వుతారు. ఏం నేను, అత్తయ్య, మా బాబు లేమా ఆనందించడానికి. నీవు మావాడివి కా దా మరెప్పుడూ ఇలా బాధపడకు.''

''నిజమే మామయ్యా మా కుటుంబానికి ఎన్నో సందర్భాలలో ఎన్నో రకాలుగా అండగా నిలిచావు.''

''బాగుంది మనిషి సాధించదలచుకుంటే దేనినైనా సాధించగలడని నిరూపించావు సుమా'' అని మాటమార్చాడు. నన్ను 'డైవర్ట్' చేయడానికి.

''కాదు మామయ్యా నన్ను గెలిపించింది స్ట్రగుల్... స్ట్రగుల్ ఉన్న చోట విజయం ఉంటుంది''

మా మాటల మధ్య మేము మామయ్య వాళ్ళింటికి చేరుకున్నాం.

* * *

పున్నమినాటి రాత్రి వెన్నెలా చల్లగా మత్తుగా హాయిగా ఉంది. భోజనాలు ముగించుకొని నేను మామయ్య డాబా పైన మంచాలు వేసుకుని నడుంవాల్చాం. ఆకాశంలో చందమామ నిండుగా ఉన్నాడు. మా గ్రామాన్ని ఒరుసుకుంటూ ప్రవహించే గోదావరి పాయలో నీటిగలగలలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. దూరంగా జాలరి ఒంటరి పాట అలలు అలలుగా గాలిపై తేలివస్తున్నది. నైట్ క్వీన్ పరిమళాలు మత్తును కలిగిస్తున్నాయి.

వెంకటపతిరాజు గారబ్బాయినని అమెరికాలో ఉంటున్నానని వివాహ సంబంధాలు కోసం వచ్చిన వారితో, అభిమానంగా పలకరించడానికి వచ్చిన వారితో, సంతాపం ప్రకటించడానికి వచ్చిన వారితో సందర్భానికి తగిన విధంగా మాటలను పేర్చుకొంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నేను పడిన శ్రమనంతా ఈ వాతావరణం వలన మరిచిపోయాను.

నా మనసు ప్రశాంతంగా ఉంది. నేనే విషయాలు తెలుసుకోవాలనుకోవటం లేదు. వాటివలన ప్రయోజనం కూడా లేదు. అయినా తెలుసుకోవాలి. అవసరమయితే వాటి నుంచి పాఠాలు నేర్చుకోవచ్చు.

''చెప్పు మామయ్యా మా కుటుంబం ఇలా కావటానికి కారణం ఎవరు? ఎందుకిలా జరిగింది?''

* * *

''ఒకసారి శ్రీరాముడు వింటినారి సవరించుకొంటుంటే ఎక్కడో చిరుకప్ప చేసే ఆర్తనాదం వినిపించింది. పరిసరాలను పరికించి చూసాడు. ఏమీ కనిపించలేదు. తన పనిలో తాను లీనమైపోయాడు. మరలా ఆర్తనాదం వినిపించింది. ఈసారి మరింత జాగ్రత్తగా గమనించాడు. అప్పుడు అతనికి తెలిసింది. ఆ ఆర్తనాదం తన కాలువద్ద నుంచి వస్తున్నదని క్రిందకు చూసాడు. వింటి యొక్క చివరి భాగాన చిన్న కప్ప కాలుపైన బలంగా మోపబడి ఉంది గబగబా వింటిని ప్రక్కన పడవేసి ఆ చిరుకప్పను చేతిలోనికి తీసుకొని ''ఓ జీవమా ఇంత బాధను భరిస్తూ ఎందుకు ఊరుకున్నావు. వెంటనే నాకు చెప్పవచ్చు కదా'' అని ఆర్తిగా అడిగాడు.

అందుకు ఆ కప్ప ''స్వామి ఇతరుల చేత బాధ కలిగితే ప్రభువైన మీకు చెప్పుకుంటాను. కాని బాధ ప్రభువు వలననే కలిగితే ఎవరితో చెప్పుకోమంటారు.'' అని అడిగింది. రాముడు బాధపడ్డాడు. ఆయన వెర్రి రాముడు కనుక బాధపడ్డాడు. కాని మన నాయకులది ఏనుగు చర్మం మందంగా ఉంటుంది. ఎవరి బాధలు వారికి పట్టవు''

నేనతని మాటలను మధ్యలోనే ఆపి ''నేను నా సమస్యకు కారణాలు చెప్పమంటే నీవేదో చెబుతున్నావు మామయ్యా''

''కాదు కరెక్టుగానే చెబుతున్నాను శ్రద్ధగా విను ప్రశ్నలు వేయకు''

''మీ నాన్నకున్న సిద్ధాంతాలు, విలువలు కారణంగా తనకు తెలియకుండానే తనచుట్టూ శత్రువర్గంను పెంచుకున్నాడు. నేను ఎన్నోసార్లు చూచాయిగా చెప్పాను. అతను మారలేదు. భవిష్యత్ ఏమిటో ఆయనకు తెలుసు. అందుకే ఉన్న మడిచెక్కను తెగనమ్మి లక్షరూపాయిలు నాకిచ్చాడు. బహుశా నీకు తాకట్టు పెట్టానని చెప్పి ఉంటాడు. మిగిలిన మడిచెక్కను తెగనమ్మి చెల్లి పెళ్ళి చేద్దాం అనుకున్నాడు. కాని దైవం అనుకూలించలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసి 'సెజ్' మీ కుటుంబాన్ని 'సీజ్' చేసింది.

''సెజ్‌లా అవేంటి నాకు తెలియదే'' అన్నాడు.

''అమెరికాలో ఉన్నవాడికి ఇక్కడి వాటి గురించి ఎలా తెలుస్తుంది. 'ప్రత్యేక ఆర్థిక మండలి' 'స్పెషల్ ఎకనామిక్ జోన్' 'సెజ్' సంక్షిప్త రూపం. ప్రభుత్వా అనుమతులన్నీ ఒకేచోట లభిస్తూ దేశీయ వస్తువులకు



విదేశాలకు ఎగుమతి అవకాశాలు కల్పిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని మన దేశానికి రప్పించే అద్భుతమైన పథకం. ఇందులో భాగంగా వివిధ సంస్థలు పరిశ్రమలను స్థాపించదలిస్తే ఒకే ప్రాంతంలో ఆయా సంస్థలు కోరినంత భూమిని స్వయంగా ప్రభుత్వమే సమకూర్చుతుంది. ఆ భూమి వ్యవసాయ భూమి అయితే రైతుకు ఎంతో కొంత ముట్టచెప్పి తీసుకుంటారు. ఇవ్వనని మొండికేస్తే అధికార్ల అండతో ప్రభుత్వ జీ.వోను చూపించి బలవంతంగా లాగేసుకుంటారు. ఇలా పారిశ్రామిక వేత్తలకు ఇచ్చిన భూమిపై ప్రభుత్వానికి ఎటువంటి అధికారం ఉండదు. ఒక వేళ ఆ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే మొదట ఐదు సంవత్సరాల వరకు ఎటువంటి సుంకాలు సదరు సంస్థలు చెల్లించనవసరం లేదు. ఈ రకమైన 'సెజ్'లను ముందుగా ప్రారంభించిన దేశం 'చైనా'. తొలిసారిగా 'గ్యాంగ్‌టంగ్' రాష్ట్రంలో 'హేంజర్'ను ఏర్పాటు చేసింది. పంధొమ్మిది వందల ఎనభై సంవత్సరానికి పద్నాలుగు వేల కోట్ల డాలర్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాలన్నీ తెలుసుకున్న ఆనాటి ఎన్.డి.ఏ ప్రభుత్వం వీటిని భారతదేశంలో ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేసింది. ఈనాటి యు.పి. ఏ ప్రభుత్వం వాటి అమలుకు పచ్చజెండా ఊపింది. ఇంకేముంది బడాబడా కంపెనీలు దరఖాస్తులను పంపుకున్నాయి. వేలకు వేల ఎకరాలు ఆయా కంపెనీల యజమానులకు ధారాదత్తం చేసింది ప్రభుత్వం. ఇలా ఒకటి రెండూ కాదు ఎకంగా నాలుగు వందల 'సెజ్'లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది ప్రభుత్వం. ఇందుకోసం ఎంత భూమి 'అప్పనంగా కుహనా పారిశ్రామిక వేత్తలు' దోచుకుంటారో ఆలోచించు. ఇక్కడ ఇంకో లొసుగు. భూమిని తీసుకొన్న సంస్థ యజమాని దానిని మరో 'బిల్డర్ నియమించుకొని అతనికి ఇచ్చేస్తాడు. ఆ 'బిల్డర్' ఇక్కడే పరిశ్రమ నెలకొల్పుతాడో లేదో ఎవరికి తెలియదు. ఇలా 'సెజ్'ల ముసుగులో 'రియల్ ఎస్టేట్' వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నదని రిజర్వ్ బ్యాంకు హెచ్చరించిందంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకో.

ఇలా ఏర్పాటు చేసిన 'సెజ్'ల వలన రైతు ఎలా నష్టపోతున్నాడో తెలియడానికి నీకో చిన్న ఉదాహరణ చెబుతాను. ముంబాయిలో 'రిలయన్స్' సంస్త 'సెజ్' ఏర్పాటుకు ముందుకు వస్తే మహారాష్ట్ర ప్రభుత్వం ముఫ్ఫైనాలుగు వేల ఐదువందల తొంభై నాలుగు ఎకరాలు అప్పనంగా ఇచ్చేసింది. ఇదంతా వ్యవసాయ భూమే. ప్రభుత్వం హెక్టారుకు- అంటే రెండున్నర ఎకరాలన్నమాట- కేవలం ఇరవై వేలు చెల్లించింది రైతులకు. సంస్థ నుంచి ఈ భూమికి నేతలు ఎకరాకు ఆరు లక్షలు వసూలు చేసారు. మరి సంస్థ యజమాని ఊరుకుంటాడా. ఇదే భూమిని ఎకరా 10 కోట్లుకు అమ్మేశాడు బిల్డర్‌కు.

ప్రభుత్వమే 'బలవంతుడు' గా మారి బలహీనమైన రైతులను బలవంతంగా అణగద్రొక్కుతుంటే రైతులు ఎలా బ్రతకాలి. మహారాష్ట్రలో జరిగిందే మన రాష్ట్రంలోనూ జరుగుతున్నది. మీ నాన్నకు జరిగింది కూడా ఇదే. మీ భూమి అసలు 'సెజ్'ల పరిధిలోనికి రాదు. కాని శత్రువర్గం, అధికారులు లాలూచి పడి కుట్రపన్ని బలవంతంగా 'సెజ్' పరిధిని పెంచి మీ భూమి కూడా అందులోనిదేనని నమ్మబలికి అన్యాయం చేసారు. లక్షరావలసిన చోట పదివేలు వస్తే ఎలా పెళ్లి చేయగలడు. ఉన్న భూమి పోయింది. అవమానం జరిగింది. తెల్లారి లేస్తే ఊర్లో ఎలా తలెత్తుకు తిరగాలి. ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలు. ఇది మీ కుటుంబానికి జరిగిన అన్యాయం కాదు ఎన్నో వేలు, లక్షల కుటుంబాలకు జరిగిన అన్యాయం. ఏదో రోజు ప్రజలు ఇంతకు ఇంత తీర్చుకోకపోరు.''

మామయ్య చెప్పడం ఆపాడు. ప్రక్కనున్న సీసాలో నీరు కొంచెం త్రాగాడు. '' ఏం నిద్రవస్తున్నదా?''

''ఇంత విన్నాకా నిద్ర వస్తుందంటావా! అయినా మరి కోర్టులు, చట్టాలు ఇవన్నీ ఈ రాష్ట్రంలో లేవా''

నా ప్రశ్న అమాయకంగా అనిపించి ఓ వెర్రినవ్వు పెదాలమీదకు బలవంతంగా అరువు తెచ్చుకొని

''నాన్న కేసు ఎవరిమీద పెడతావు? సంస్థల మీద, బిల్డర్ మీద, ప్రభుత్వం మీద, సి.యం. మీద ఒకవేళ పెట్టావే అనుకో తాత్కాలిక స్టే ఇస్తారు. వాదోపవాదాలు జరుగుతాయి. చివరకు నీ ముని మనవళ్లకు కూడా న్యాయం అందుతుందని నేననుకోను. సివిల్ కేసులు అంతే''

ఇద్దరం ఎవరం మాట్లాడుకోలేదు. గాలి చల్లగా ఉంది.

చంద్రుడు మబ్బులతో దోబూచులాడుతున్నాడు. ఎక్కడో కుక్క సన్నగా ఏడ్చిన శబ్ధం. సమయం పదకొండు పన్నెండు కావచ్చు.

మామయ్య మెల్లగా చెప్పాడు ''మీ నాన్నకున్న ముందుచూపు వలన మీ కుటుంబంలో నీవైనా మిగిలి ఈ స్థితిని అందుకున్నావు. కొన్ని కుటుంబాలు ఈ మాత్రం అడ్రస్సు కూడా లేకుండా గల్లంతయినాయి.''

నన్ను ఇంటి నుంచి వెళ్ళిపొమ్మన్న రాత్రి నాన్న చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి ''భవిషత్తులో రైతులు అనే జాతి లేదా వర్గం ఉండక పోవచ్చును''

ఎంత నిజం.

ప్రభుత్వాలు వ్యాపారవేత్తలు కొమ్ముకాస్తూ వారికోసం 'రైతుల శ్రేయస్సనే' ముసుగులో 'రుణాల మాఫీ' 'సెజ్'లని వివిధ పథకాలు రచన చేస్తుంటే ఈ విషవలయంలో చిక్కుకున్న రైతులు వలస కూలీలుగా మారుతున్నారు.

ఇది వర్తమానం చిత్రం. మరి భవిష్యత్తు?

''ఏంటాలోచిస్తున్నావు? భవిష్యత్తు గురించా? అవును గాని నాదొక అనుమానం ఆ పిచ్చోడి కోసం అంత ఖర్చు అవసరమంటావా అదలా ఉంచు. రేపటి గురించి ఏం ఆలోచించావు?''

''ఏం మిగిలిందని ఆలోచించాలి? ఉన్న ఆ పాత ఇంటిని అమ్మేయి మామయ్యా. ఆ డబ్బులు కూడా నాకొద్దు. అత్తయ్యకు ఈ అల్లుడి కానుక అనుకొని ఏదైనా వస్తువు చేసి పెట్టు. నీకు ఎంత చేసినా నీవు మాకు చేసిన సహాయానికి, సేవకు సరికాదు. ఏదో నా గుర్తుగా అంతే. ఆ పిచ్చోడు బాగుపడతాడు. డాక్టర్ మీద నాకా నమ్మకం ఉంది. నా అంచనా ప్రకారం మరో పది రోజులలో అతనికి నయమవుతుంది. ఆ తరువాత అతనిని తీసుకొని నేను హైదరాబాద్ వెళ్ళిపోతాను. మా కంపెనీ వాళ్ళు అంగీకరిస్తే అవకాశమిస్తే అమెరికాలో స్థిర పడిపోతామను కుంటున్నాను. ఆ పిచ్చోడితో సహా.''

మామయ్యలో వచ్చే రియాక్షన్ కోసం ఆగాను నేననుకొన్న రియాక్షన్ అతని గొంతులో కనిపించింది.

''ఏంటి పిచ్చోడితో అమెరికాలో స్థిరపడతావా! నీకేమైనా పిచ్చా?''

''ఇంతకీ ఆ పిచ్చోడు ఎవరనుకుంటున్నావు మామయ్యా సమాజం చేత, అభిమానించిన వ్యక్తుల చేత, చివరకు ప్రభుత్వం చేత వంచనకు గురయిన వ్యక్తి, అనూహ్యంగా మృత్యువు కూడా అతన్ని చీదరించుకుంది. అటువంటి నిర్భాగ్యుడు మామయ్యా''

''అంటే అతను...'' మామయ్య గొంతులో ఆనందం, ఆశ్చర్యం..

''అవును మామయ్యా ఆ పిచ్చోడు మా నాన్న''

★

